ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 28 మే 2025



ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలి

పాతశ్రీకాకుళం, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని 'ఆప్టా'(ఆంధ్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్) జిల్లాఅధ్యక్షులు ఎస్‌వీఎస్‌ఎల్ పూర్ణిమ, జనరల్ సెక్రటరీ జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 'ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి 24 పాయింట్లు కేటాయించాలి. అన్ని జిల్లాల్లో 8ఏళ్ల సర్వీసు పూర్తయిన వారు 2వేల మంది వరకు ఉండటంతో.. ప్లేస్‌ల ప్రాధాన్యం క్రమంలో ఆప్షన్ ఇవ్వటం కష్టతరంగా ఉంది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్.. ఎస్జీటీల వంటి ఎక్కువ కేడర్ వారికి ఉపయోగం ఉండద'ని వారు స్పష్టం చేశారు.



మహానాడులో మనోళ్లు

శ్రీకాకుళం, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడుతోపాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు టీడీపీ నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు. మూడురోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలు తొలిరోజు విజయవంతంగా సాగాయి. శ్రీకాకుళం పార్లమెంట్ స్టాల్ వద్ద పలువురు కార్యకర్తలు సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు.







శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చేరిన వరదనీరు.. ప్రయాణికులు, సిబ్బంది అవస్థలు



కుండపోత

- జిల్లా అంతటా వర్షం
- శ్రీకాకుళం జలమయం
- కాంప్లెక్స్ వరదనీటితో ఇక్కట్లు

శ్రీకాకుళం, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. పోలాకి మండలంలో అత్యధికంగా 91.75 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కోటబొమ్మాళిలో 89.0, సంతబొమ్మాళిలో 86.25, నందిగాంలో 84.5, శ్రీకాకుళం రూరల్‌లో 77.0, శ్రీకాకుళం సిటీలో 64.5, గారలో 60.75, పలాసలో 43.75, ఆమదాలవలసలో 20.0, రణస్థలంలో 18.0, వజ్రపుకొత్తూరులో 16.0, ఎచ్చెర్లలో 15.0, కొత్తూరులో 13.5, లావేరులో 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో భారీవర్షం కారణంగా ప్రధాన జంక్షన్లు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మూడు అడుగుల ఎత్తున నీరు చేరిపోయింది. ప్రయాణికుల రిజర్వేషన్ కౌంటర్ వద్ద వర్షపు నీటిలోనే సిబ్బంది విధులు నిర్వహించారు. అలాగే డేఅండ్‌నైట్ జంక్షన్, బొందిలీపురం జంక్షన్, కృష్ణాపార్క్, బలగ మెట్టు, అటవీశాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు చెరువులను తలపించాయి. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షంతోపాటు ఈదురుగాలుల బీభత్సంతో సుమారు రెండు గంటలపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వంశధార కార్యాలయంలోకి నీరు

టెక్కలి, మే 27(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని వంశధార కార్యాలయంలోకి వరదనీరు చేరిపోయింది. కార్యాలయంలోని ఫైళ్లు, సామగ్రి తడిచిపోవడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మొదలుకొని సిబ్బంది వరకు నానా అవస్థలు పడ్డారు. వంశధార ఈఈ కార్యాలయానికి ముందు ఉన్న జిల్లా కేంద్రాసుపత్రికి డ్రైనేజీ లేకుండా.. సీసీ రోడ్డు వేసి ఎత్తుచేశారు. దీంతో వరదనీరంతా వంశధార కార్యాలయంలోకి చేరిందని పలువురు పేర్కొన్నారు.





టెక్కలి వంశధార ఈఈ కార్యాలయంలోకి చేరిన వరదనీరు

శ్రీకాకుళంలో రహదారిపై నిలిచిన వర్షపునీరు

ముగిసిన ఏపీ ఈఏపీ సెట్

- నాలుగు కేంద్రాల్లో 12,633 మంది హాజరు

ఎచ్చెర్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ మంగళవారంతో ముగిసింది. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీ(నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంటు (టెక్కలి)లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ నాలుగు కేంద్రాల్లోనూ 13,298 మంది విద్యార్థులకుగానూ 12,633 మంది(95 శాతం) హాజరయ్యారు. ఇందులో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బైపీసీ స్ట్రీమ్‌లో 3,864 మంది దరఖాస్తు చేయగా, 3,571 మంది(92.42 శాతం) పరీక్ష రాశారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి 9,434 మందికిగానూ 9,062 మంది(96.17 శాతం) హాజరయ్యారు. మంగళవారం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 280 మందికి 271 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 168 మందికి 161 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ తదితరులు

యోగా.. జీవితంలో భాగం కావాలి

- సాధనతో ఆరోగ్యకర సమాజం సాధిద్దాం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్
- డచ్ బిల్డింగ్ వద్ద వెయ్యి మందితో ఘనంగా కార్యక్రమం

4లో

రేపటి నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్ర

- కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస/ పాత శ్రీకాకుళం, మే 27(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్ర నిర్వహించనున్నట్టు ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ యాత్రలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు, పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు, భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థల నిపుణులు ప్రతిరోజూ మూడు గ్రామాల్లో పర్యటిస్తారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలు, నూతన సాంకేతికతపై అవగాహన కల్పిస్తారు. వివిధ పంటల్లో సమస్యలకు పరిష్కారం సూచిస్తారు. వ్యవసాయంతో పాటు పశు సంపద, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై సమాచారం అందిస్తారు. దేశవ్యాప్తంగా 2వేల మంది శాస్త్రవేత్తలు, 1.5 కోట్ల మంది రైతులతో ప్రత్యక్షంగా సంబంధం కలిగి.. వ్యవసాయాభివృద్ధికి తోడ్పడతారు. రైతులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాల'ని భాగ్యలక్ష్మి కోరారు.



కేశవరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తల్లి భారతమ్మ

చితాభస్మం కావాలా.. సంతకాలు పెట్టండి

- కేశవరావు సోదరులపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఒత్తిడి
- విలపిస్తున్న తల్లి భారతమ్మ

6లో

అమరవీరుల స్మారక సభ నిలుపుదల

- అడ్డుకున్న పోలీసులు
- ఆందోళన చెందిన ప్రజాసంఘాలు

పలాస రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): పలాస మండలం బొడ్డపాడులో మంగళవారం అమరవీరుల స్మారకసభను నిర్వహించకుండా పోలీసులు అడ్డుకున్నారు. నాటి పాలకుల తీరుకు వ్యతిరేకంగా.. 1969 మే 27న జరిగిన శ్రీకాకుళ సాయుధ పోరాటంలో పంచాది కృష్ణమూర్తి, శృంగవరపు నర్సింహులు, దున్న గోపాలపారావు, బైనపల్లి పాపారావు, నిరంజన్ సాహు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. వారి త్యాగాలకు గుర్తుగా బొడ్డపాడులో 1990లో ప్రజల సహకారంతో అమరవీరుల స్మారక మందిరాన్ని ఏర్పాటు చేశారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ.. ఏటా మే 27న ఇక్కడ స్మారక సభ (మిగతా 6వ పేజీలో..)



అమరవీరుల స్మారక సభను అడ్డుకున్న పోలీసులు

ఉపాధ్యాయుల బదిలీల్లో.. పాయింట్లే కీలకం



- అప్రమత్తంగా లేకుంటే అర్హులకు అన్యాయమే
- ముగిసిన దరఖాస్తుల గడువు
- స్పౌజ్‌లో అదనపు పాయింట్ల కోసం కక్కుర్తి
- గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతి ప్రక్రియ ప్రారంభం

నరసన్నపేట, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు ఎంతో కీలకం. కోరుకున్న స్థానాలు దక్కించుకోవాలంటే అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. న్యాయబద్ధంగా రావాల్సిన పాయింట్ల కోసం రాజీ పడకుండా ప్రయత్నించడంతో పాటు ఇతరులు అక్రమంగా పొందకుండా అడ్డుకోవాలి. లేదంటే స్థానాలు పొందే విషయంలో అన్యాయం జరగడం ఖాయం. కొంతమంది అర్హత లేకపోయినా.. పాయింట్ల కోసం తమకు వర్తించని అంశాలను దరఖాస్తులో పొందుపర్చి ప్రయతిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు మాజీ సైనికోద్యోగులు.. ఉపాధ్యాయులుగా పని చేస్తుంటే వారికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు. ప్రస్తుతం సైనికోద్యోగులుగా పనిచేస్తున్న వారి స్పౌజ్‌కు ఐదు పాయింట్లు కేటాయిస్తారు. మాజీ సైనికోద్యోగుల స్పౌజ్‌కు మాత్రం ఎటువంటి పాయింట్లు రావు. కానీ 2017 బదిలీల్లో స్పౌజ్‌లో వినియోగించుకున్న కారణంగా.. ఈ బదిలీల్లో కూడా ఒక ఉపాధ్యాయురాలు ఐదు పాయింట్లు పొందారు. కానీ దరఖాస్తు పరిశీలన సమయంలో ప్రస్తుతం భర్త పదవీవిరమణ పొందినట్లు తెలియడంతో ఎంఈవోలు వీటిని తొలగిస్తున్నారు.

- **స్పౌజ్‌ల విషయంలో తిరకాసు**

జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు బదిలీల్లో స్పౌజ్‌ల విషయంలో తిరకాసు జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఈ పాయింట్ల కోసం ఎటువంటి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసే అవసరం లేకపోవడంతో కొందరు దరఖాస్తు సమయంలో స్పౌజ్ పొందారని తెలుస్తోంది. భార్యాభర్తలు ఉద్యోగులైతే ఈ ఎనిమిదేళ్ల సమయంలో బదిలీల్లో ఒక్కరే స్పౌజ్‌ను వినియోగించాలి. కానీ కొందరు ఉద్యోగులు2023 బదిలీల్లో ఒకరు, ఈ బదిలీల్లో మరొకరు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం భార్యాభర్తలిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వరంగ, ఎయిడెడ్, స్థానిక సంస్థలు, ప్రభుత్వ విద్యారంగ సొసైటీల్లో పనిచేసేవారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు కేటాయించనున్నారు. అయితే కొందరు అర్హత లేకపోయినా స్పౌజ్ పాయింట్లు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారని సమాచారం. నిబంధనలు మేరకు 5/8 సంవత్సరాలు పూర్తయిన హెచ్‌ఎంలు, టీచర్ల మాత్రమే వినియోగించుకోవాలి. కానీ కొందరు ఆ సమయం పూర్తికాకపోయినా వినియోగించుకున్నారన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తుల పరిశీలన పక్కాగా నిర్వహించి అక్రమార్కులను ఏరివేసి తమకు న్యాయం చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- **ముగిసిన ఎస్జీటీ దరఖాస్తుల ప్రక్రియ**

ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలకు చెందిన దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. మంగళవారం నాటికే తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులు దరఖాస్తులు ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఈవోలు బృందం పరిశీలించి తుది పరిశీలనకు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించేసారు. ఎస్జీటీలు సుమారు 3,700 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. దరఖాస్తులను రెండో విడతగా జిల్లాలో పరిశీలన చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో ప్రాథమిక సీనియార్టీ జాబితాను ఉంచనున్నారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో (మిగతా 4వ పేజీలో..)



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.





మహానాడులో మన నేతలు

కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అక్కడ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఇదిలా ఉండగా.. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జర్మనీ పర్యటన నుంచి నేరుగా మహానాడుకు హాజరయ్యారు.

-ఆంధ్రజ్యోతి బృందం



అరసవల్లి: మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు



హిరమండలం: మహానాడులో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు తదితరులు



పలాస: కడప ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే గౌతు శిరీషకు స్వాగతం పలుకుతున్న పలాస టీడీపీ నాయకులు



నరసన్నపేట: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకులు



ఆనందపురంలో ఘనంగా సిరిమానోత్సవం

జి.సిగడాం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంలో చంద్ర మాణిక్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి వందలాది మంది మహిళలు చీరలు, పసుపు, కుంకుమ, ముర్రాటలు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వై.మధుసూధనరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యోగా.. జీవితంలో భాగం కావాలి

- సాధనతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- డచ్ బంగ్లా వద్ద వెయ్యి మందితో ఘనంగా కార్యక్రమం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఒక భాగం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. నగరంలోని కలెక్టరేట్ వద్ద గల డచ్ బంగ్లా ఆవరణలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 1000 మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట యోగా శిక్షకులు కార్యక్రమంలో పాల్గొన్న వారితో యోగాసనాలు, ధ్యానం చేయించారు. వెయ్యి మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని 10 బ్లాకులుగా విభజించి, ప్రతి బ్లాక్‌కు ఎదురుగా ఒక యోగా శిక్షకుని ద్వారా ప్రదర్శన చేయించారు. మొత్తంగా 45 మంది యోగా శిక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డచ్ బిల్డింగ్ చరిత్రను తెలియజేసే బ్యానర్లను వేదిక వద్ద ప్రదర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 20వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రత్యేకించి నాలుగు చారిత్రక ప్రదేశాల్లో కనీసం వెయ్యి మందితో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నెల రోజుల పాటు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే, వారి జీవితంలో కచ్చితమైన మార్పు వస్తుందని తెలిపారు. దీని వల్ల శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.జగదీష్, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, యోగా ప్రతినిధులు సందీప్, కల్పన, గోవింద్, సురేంద్ర, చిన్నబాబు పాల్గొన్నారు.



యోగాంధ్ర ఫొటో స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



యోగాసనాలు వేస్తున్న ప్రజలు

ఉపాధ్యాయుల బదిలీల్లో.. పాయింట్లే కీలకం

(మూడో పేజీ తరువాయి)

మూడు సాంకేతిక బృందాలు పరిశీలిస్తాయి. తర్వాత తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తారు.

హెచ్‌ఎంల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన

శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో.. మంగళవారం ఎస్ఏల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 82 మంది వరకు గ్రేడ్-2 హెచ్‌ఎంలగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ పూర్తయిన తరువాత ఉన్న ఖాళీలు ఆధారంగా పదోన్నతి పొందిన ఎస్ఏలకు గ్రేడ్-2 హెచ్‌ఎంలగా నియమాక పత్రాలను అందజేస్తారు.

● **ఫిర్యాదుల పరిష్కారానికి..:** ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సాంకేతిపరంగా మూడు బృందాలను ఏర్పాటు చేశామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. ఎంఈవోల నుంచి వచ్చిన దరఖాస్తులను పునఃపరిశీలన కోసం టెక్కలి, పలాస, శ్రీకాకుళం, పాలకొండ రెవెన్యూ డివిజన్ వారీగా కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. స్పౌజ్, ప్రత్యేక కేటగిరి చెందిన దరఖాస్తులను పరిశీలన చేసేందుకు మరో మూడు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే గ్రేడ్-2 హెచ్‌ఎంలు, ప్రాథమిక సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించామన్నారు. ఆన్‌లైన్‌లో తుది సీనియార్టీ జాబితాను పొందుపరిచామని డీఈవో తెలిపారు.

రహదారి పనుల జాప్యంపై ఆగ్రహం

- రోడ్డెక్కిన సిరుసువాడ ప్రజలు

కొత్తూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): సిరుసువాడ-కుంటిభద్ర రహదారి పనుల జాప్యంపై సిరుసువాడ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామస్థులు రహదారి పైకి వచ్చి నిరసన తెలిపారు. పనులు అర్థాంతరంగా నిలిపివేయడంతో రహదారిపై నీరు నిలిచి... బురదమయంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగు తున్నాయని అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి సిరుసువాడ, కుంటిభద్ర గ్రామాల వరకు రహదారికి ఇరువైపులా మట్టితో బెర్మలు వేశారని ఆరోపించారు. వీటి వల్ల రహదారి బురదమయం అవుతోంద న్నారు. తక్షణం పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించేలా అధి కారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బురద కారణంగా వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రోడ్డు సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారంతా హెచ్చరించారు.



రహదారిపై నిరసన తెలుపుతున్న సిరుసువాడ ప్రజలు

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.81.84లక్షలు



ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

అరసవల్లి, మే27(ఆంధ్రజ్యోతి):అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారి 14 హుండీలను మంగళవారం ఆలయఅనివెట్టి మండపంలో శ్రీహరిసేవా, సత్య సాయిసేవా సమితి, శ్రీవారిసేవా సమితి సిబ్బంది లెక్కించారు. ఆదిత్య ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో 60 రోజులకు నిర్వహించిన లెక్కింపులో రూ.81,84,890ల ఆదాయంలభించింది. ఇందులో నోట్ల రూపంలో రూ.77,21,606లు, చిల్లర ద్వారా రూ.4,63,284లు లభించాయి. అలాగే 12 యూఎస్ డాలర్లు - 12, పది నేపాల్ రాష్ట్ర బ్యాంకు సెర్వింగ్స్, ఒక ఒమెన్ రియాల్, బంగారం 81గ్రాముల 27మిల్లీగ్రాములు, వెండి మూడు కేజీల 810 మిల్లీగ్రాములు లభించాయి.కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, ఆముదాలవలస గ్రూప్ దేవాలయాల ఈవో తమ్మినేని రవి, టెక్కలి ఈవో గురునాథం, ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం ఈవో సుకన్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో మహాయజ్ఞం

ఇచ్ఛాపురం, మే27(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సత్యసాయిబాబా మందిరం పక్కన నిర్మించిన ధ్యానాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పర్ణశాలలో 12గంటలపాటు వేదపండితులు మహా యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.కార్యక్రమంలో విగ్రహ నిర్వాహకులు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దాసరిరాజు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరం

ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛానగర్ కాలనీతోపాటు సంతపేట, జర్నలిస్ట్ కాలనీ ప్రజలు స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సిందూర మర్దన, కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలుచేశారు. సాయంత్రం అమ్మవారికి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు.

కంచమ్మతల్లికి పాయసం అట్లు

కంచిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): కంచిలిలో కంచమ్మతల్లి సంబరాల నేపథ్యంలో అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం అట్లు పాయసం నైవేద్యం నివేదన చేశారు. కార్యక్రమంలో దత్తత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కవిటిలో సొమ్మల వారం



కవిటిలో పూజలుచేస్తున్న రైతులు

కవిటి, మే27(ఆంధ్రజ్యోతి): కవిటిలోని బీలప్రాంత రైతులు మంగళవారం ఘనంగా సొమ్మలవారాన్ని నిర్వహించారు. బీలప్రాంత పొలాల్లోని శ్రీకృష్ణుని మందిరంవద్ద రైతులు, యువకులు జి.మన్మథరావుస్వామి ఆధ్వర్యంలో రైతులు పాయసం,పండ్లు నైవేద్యాలుగా సమర్పించారు. పశుసంపద ఈఏడాది అభివృద్ధి చెంది, వర్షాలుసకాలంలో కురిసి పంటలు సక్రమంగా పండాలని సొమ్మల వారాన్ని నిర్వహించారు. పూర్వీకుల నుంచి ఆచారంగా వస్తున్న సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నామని రైతులు చెప్పారు.

నన్నే ప్రశ్నిస్తారా.. డిజిటల్ అసిస్టెంట్ హల్‌చల్

కవిటి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లండారిపుట్టుగ గ్రామ సచివాలయం డిజిటల్అసిస్టెంట్ సోమవారం ఆలస్యంగా విధులకు రావడంతో రేషన్ కార్డుల్లో మార్పులు, అప్‌డేట్‌కోసం వచ్చిన లబ్ధిదారులు అవస్థలకు గురయ్యారు. ఇక్కడి డిజిటల్ అసిస్టెంట్ ఈశ్వరరావు సోమవారం విధులకు ఆలస్యంగా వచ్చాడు.అప్పటికే గ్రామసచివాలయంవద్ద రేషన్‌కార్డు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చారని వారంతా ఆయన్ను ప్రశ్నించారు. దీంతో ఈశ్వరరావు నన్నే ప్రశ్నిస్తారా అని రేషన్‌కార్డు సేవల కోసం వచ్చిన వారి దరఖాస్తులను తిరస్కరించి ఎవరికీ చెప్పుకుంటారో చెప్పండని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈవ్యవహారం మంగళవారం సోషల్ మీడియాలో హల్‌చల్‌చేసింది.ఆలస్యంగా ఎందుకు వచ్చావని ప్రశ్నించినందుకే ఉద్యోగి అలా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా డిజిటల్అసిస్టెంట్ రేషన్‌కార్డు లబ్ధిదారులతో వ్యవహరించిన తీరు గురించి తెలిసిందని, గ్రామకార్యదర్శికి పంపించి పరిశీలించాలని ఆదేశించాలని కోరామని మండలపరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శిస్తు చెల్లించి.. రశీదులు పొందినా

- పురుషోత్తపురంలో మళ్లీ చెల్లించాలని రెవెన్యూ అధికారుల ఒత్తిడి

సరుబుజ్జిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురంలో సత్వరమేమళ్లీ శిస్తుచెల్లించాలని రెవెన్యూఅధికారులు ఒత్తిడిచేస్తున్నారని సుమారు 300 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే గ్రామానికి చెందిన మొదలవలస సన్యాసప్పారావు తనశిస్తు ఖాతానెంబర్ 276, చిగురుపల్లి శ్రీదేవి శిస్తు ఖాతానెంబర్ 1327, మొదలవలస భారతి శిస్తు ఖాతా నెంబర్‌కు అన్ని ఫసలీలకు సంబంధించి మూడేళ్లుగా నాలుగు వేల రూపాయలు శిస్తు చెల్లించినట్లు ఆన్‌లైన్ రశీదులు పొందారు. గ్రామంలోని రైతులందరికి ఇదే పరిస్థితి నెలకొంది. అయితే మళ్లీ ఐదేళ్లకు సంబంధించి ఐదు వేలు బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని రైతులు వాపోయారు. అసలు తాము చెల్లించిన శిస్తు ఏమయ్యిందోనని ప్రశ్నిస్తున్నారు. కాగా రైతులు తమ వద్దకు వస్తే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని వీఆర్వో రవికుమార్ తెలిపారు.

వ్యవసాయ పరికరాల పరిశీలన



రైతులకు అందజేసిన పరికరాల పనితీరును పరిశీలిస్తున్న కూర్మారావు

సోంపేట, మే 27(ఆంధ్రజ్యోతి): రాయితీపై పంపిణీచేసిన వ్యవసాయ పరికరాలను ఆగ్రోస్ జిల్లా మేనేజర్ హనుమంతుకూర్మారావు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పలాసపురం, బెంకిలి తదితర గ్రామాల్లో రైతులకు పంపిణీచేసిన పిచికారి పంపుల నాణ్యత పరిశీలించి ఉపయోగించే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీ కె.జగన్మోహనరావు, ఏవో బి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి ప్రాధాన్యం

పాతశ్రీకాకుళం, మే 27(ఆంధ్రజ్యోతి):జిల్లాలో గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఐఎస్‌డీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సూర్యం ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రె పెంపక సంక్షేమ సహకార సంఘాలకు అవసరమైన సహకారాన్ని శాఖపరంగా అందజేస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జి.సిగడాం, మే 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆనందపురంలో అసిరితల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా చంద్రమాణిక్యాలమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట నాయకులు వజ్జపర్తి రఘురాం, పోగిరి నారాయణరావు, పొగిరి పాపారావు, టంకాల మౌళీశ్వరరావు, చిత్తిరి తిరుపతి, చిత్తిరి లక్ష్మం, బెవర జగన్నాథరావు, చిన్నారావు ఉన్నారు.

చిత్తశుద్ధి లేక.. సంపద రాక

- శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు
- ఇదీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ డంపింగ్ యార్డు పరిస్థితి



నిరుపయోగంగా ఉన్న తడి-పొడి చెత్త సంపద కేంద్రం

పలాస, మే 27 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు నిర్వహణ నీరుగారుతోంది. ఆర్థికస్వావలంబన సాధించాలని డంపింగ్ యార్డులో చేపట్టిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. ఈనేపథ్యంలో ఇక్కడ సిబ్బందికి చిత్తశుద్ధి లేకపోవడంతో సంపద రాని పరిస్థితి నెలకొంది.

పట్టణానికి సమీపంలో కోసంగిపురం జంక్షన్‌లో తొమ్మిది ఎకరాల్లో జిల్లాలోనే అతిపెద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ మునిసిపాలిటీ పరిధిలో 50 టన్నుల వరకు వివిధ రకాల వ్యర్థాలు సేకరించి ఇక్కడకు తరలిస్తున్నారు. అయితే చెత్త నుంచి సంపద తీసే కార్యక్రమం చేపట్టాల్సిఉన్నా మునిసిపల్ అధికారుల్లో చిత్తశుద్ధి లేక పోవడంతో సేకరించిన చెత్తను కాల్చేస్తున్నారు. ఫలితంగా సంపద రావడంలేదు. దీంతో మునిసిపాలిటీ ఆర్థిక స్వాలంబన సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీనికితోడు చెత్తను కాల్చడం వల్ల ఇక్కడ పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



తుప్పుపట్టిపోతున్న పల్వనైజర్

సిబ్బంది లేక..

డంపింగ్ యార్డు ఏర్పాటుచేసిన సమయంలో వర్మికంపోస్ట్ యూనిట్, తడి, పొడిచెత్త వేరుచేసే కేంద్రాలు, పల్వనైజర్, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలు నిర్మించారు. అవి నిర్వహణ లేకపోవడంతో వినియోగించకుండా శిథిలావస్థకు చేరాయి. 2019లో సంభవించిన తితలీ తుఫాన్‌కు కొన్ని యంత్రాలు, నిర్మాణాలు దెబ్బతిన్నాయి. దీంతో డంపింగ్ యార్డులో చెత్తను కాల్చి బూడిద చేయడం తప్పా సంపద సృష్టించడం అటకెక్కిపోయింది. పట్టణంలో సేకరిస్తున్న చెత్త నుంచి ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలు వేరుచేసి రీసైకిలింగ్ చేయాల్సిఉంది. అయితే అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో డంపింగ్ యార్డులో కల్పించిన వసతులు, సౌకర్యాలు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. డంపింగ్ యార్డులో ప్రహరీ నిర్మాణంతోపాటు మంచినీటి సౌకర్యాలు కల్పించారు. కొద్దిమంది సిబ్బందిని నియమించి డంపింగ్ యార్డును అభివృద్ధి చేస్తే మునిసిపాలిటికి దీర్ఘకాలిక ఆదాయం వచ్చే అవకాశముందని, ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

చెత్త నిల్వలు లేకుండా చర్యలు

డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించామని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ప్రతిరోజూ 20 టన్నులకు పైగా చెత్త వస్తుండడంతో డంపింగ్ యార్డు నిండిపోతోందని చెప్పారు. ఇక్కడి చెత్తను విశాఖ పట్నంలోని సంపదకేంద్రానికి తరలించాల్సిఉందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు దీన్ని పరిశీలించారని తెలిపారు. త్వరలో చెత్తను తరలించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమన్వయంతో పనిచేయండి

- యోగాంధ్ర పై అవగాహన పెంచాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 27(ఆంధ్రజ్యోతి):అధికారులంతా సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ప్రజల ఆలోచనల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు.మంగళవారం జిల్లా అభివృద్ధికి సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. ప్రధానంగా పింఛన్లు, వ్యవసాయం, మహిళల భద్రత, ఆసుపత్రిసేవలు, రేషన్,విద్యుత్, ఇసుక, మద్యం, నిత్యావసరసరుకుల ధరలు, ఆలయాల్లో సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.యోగాంధ్ర -2025పై అవగాహన పెంచాలని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు, గనులశాఖలో నియంత్రణ వ్యవస్థలు, వర్షాకాలానికి ఇసుక నిల్వలు, నీటి పారుదల పనులు, స్వచ్ఛభారత్ కింద పారిశుధ్య నిర్వహణపై చర్చించారు. కాలానుగుణ వ్యాధుల, నీటి పరీక్షల నిర్వహణ, సాగు భూముల గుర్తింపు, ఆక్రమణల క్రమబద్ధీకరణ, రెవెన్యూ కేసులు, భూసమస్యల పరిష్కారం తదితర సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల పనుల పురోగతి, పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.రోడ్లు, తాగునీరు, అంగన్‌వాడీకేంద్రాలు, హాస్టళ్ల నిర్మాణంపై సమీక్షించారు.కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐటీడీఏ పీవో శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతీ సౌజన్య, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

ఎచ్చెర్ల, మే 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో చదువుతున్న పీజీ మొదటి, ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌కు 42 మంది హాజరుకాగా శతశాతం ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. పీజీలో అన్ని కోర్సులు కలిపి మొదటి సెమిస్టర్‌లో 574 మంది హాజరుకాగా 411 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలు వర్సిటీ వెబ్ సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఫలితాలపై ఎటువంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లోగా పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేయాలని కోరారు.

షిప్ బిల్డింగ్ యూనిట్ కోసం స్థల పరిశీలన



తోనంగి వద్ద ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న హరికృష్ణన్

గార, మే 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని తోనంగిపరిధిలో షిప్‌బిల్డింగ్ యూనిట్ నిర్మాణానికి స్థలాన్ని మంగళవారం అధికారులు బృందం పరిశీలించింది. గోవా నుంచి వచ్చిన షిప్ యార్డు విశ్రాంత కమాండెంట్ ఎం.హరికృష్ణన్, ఆర్ఐ రాజేంద్ర, మండల సర్వేయర్ శ్రీరామమూర్తి, వీఆర్వో సుశీల తోనంగి సమీపంలో ఉన్న ప్రభుత్వభూమిని పరిశీలించారు. ఈ మేరకు ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గోవా నుంచి వచ్చిన షిప్‌యార్డ్ హరికృష్ణన్‌కు చూపించారు.

యోగా సాధనతోనే ఆరోగ్యం: వీసీ

ఎచ్చెర్ల, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. మంగళవారం వర్సిటీలోని యోగా, ఫిట్‌నెస్ విభాగం ఆధ్వర్యంలో యోగాంధ్ర -2025లో భాగంగా యోగా విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీ ప్రిన్సిపాళ్లు ఎం.అనూరాధ, ఎస్.ఉదయ భాస్కర్, సీహెచ్.రాజశేఖరరావు, ఎస్‌వో ఎస్.సామ్రాజ్యలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ, యోగా విభాగం కోఆర్డినేటర్ కేవీఎన్ మూర్తి పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: యోగాసనాలు వేస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

- సరుబుజ్జిలి, మే27(ఆంధ్రజ్యోతి):రొట్టవలస జడ్పీఉన్నతపాఠశాల ఆవరణలో యోగా మాసోత్సవాల మండల స్థాయి కార్యక్రమం మంగళవారం నిర్వహిం చారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, ఈవోపీఆర్డీ రామారావు, ఏవో వరప్రసాద్, ఆయుర్వేద వైద్యాధికారి పూజారి పురుషోత్తమరావు పాల్గొన్నారు.
- కవిటి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారతారని ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. కవిటి మండలపరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా అధికారులు యోగాసనాలువేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ఎస్.జయసూర్య పాల్గొన్నారు.
- పొందూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా సాధనతో దీర్ఘకాలరోగాలకు పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ ఆర్. వెంకటేష్, ఎంపీడీవో ఎం. మన్మథరావు తెలిపారు.పొందూరు మార్కెట్‌కమిటీలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పి. రాజారావు, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతను మేల్కొలిపేందుకే సైకిల్ యాత్ర

రణస్థలం, మే27(ఆంధ్రజ్యోతి):ఆధ్యాత్మికతపై యువతను మేల్కొలిపేందుకే సైకిల్ యాత్ర చేపట్టానని పశ్చిమగోదవరి జిల్లా జిల్లా నరసాపురానికి చెందిన పోలిశెట్టి శివరామకృష్ణ తెలిపారు. రణస్థలంలోని అయ్యప్ప, జగన్నాథస్వామి ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల 15న ఈ యాత్ర ప్రారంభించానని చెప్పారు. రాష్ట్రంలో ఐదువేల దేవాలయాలు ఉన్నాయని, ఇప్పటికి 70 శాతం ఆలయాలు దర్శించుకున్నట్లు తెలిపారు.కర్నూలుమీదుగా తిరుపతి చేరుకుని సైకిల్ యాత్ర ముగిస్తినని చెప్పారు.ఆలయాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తానని చెప్పారు.

సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న శివరామకృష్ణ



పోలీస్ జాగిలాలతో తనిఖీలు

శ్రీకాకుళం క్రైం, మే27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో మత్తు, పేలుడు పదార్థాలు అక్రమనిల్వలు, రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామారావు తనిఖీచేశారు. ఆర్టీసీకాంప్లెక్స్ ఆవరణలో పోలీసు జాగిలాలతో అనుమాని త ప్రదేశాలు, పార్శిల్ సర్వీస్, దుకాణాలు, వాహనాలు, ప్రయాణికులు లగేజీ బ్యాగ్‌లుపరిశీలించారు.గంజాయి, మత్తుపదార్థాలు, నిషేధిత పేలుడు పదార్థాలు, అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు సోదాలు నిర్వహించారు.

యువత క్రీడల్లో రాణించాలి

బూర్జ, మే 27 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిం చాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం కోరకారు. మదనాపురం లోని జన సైనికులకు క్రికెట్ బ్యాట్లు పంపిణీ చేశారు.

దుర్గంధం మాటున పట్టణం

- రోడ్లపైనే మురుగునీరు, చెత్త
- పూడికతో నిండిపోయిన కాలువలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- టెక్కలి మేజర్‌పంచాయతీలో ఇదీతీరు

టెక్కలి, మే 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో నిరంతరం పారిశుధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే అంతంత మాత్రపు పారిశుధ్య పనులు.. పైగా ఏమాత్రం వర్షం పడినా ప్రజల బాధలు వర్ణనాతీతం. చినుకుపడిందంటేచాలు కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ, చెత్తతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆదీ ఆంధ్రా వీధి, కంద్రవీధి, మెట్టవీధి, గొల్లవీధి, ఎన్టీఆర్ కాలనీ, కచేరి వీధి, చిన్నబజారు, రామదాసుపేట, చేపల బజారు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజా ప్రతి నిధులు, అధికారులు పర్యటిస్తేనే ఒకటి రెండు రోజులు పారిశుధ్య సిబ్బంది హడావుడి చేస్తారు. ఆ తరువాత షరా మామూలే.. టెక్కలి మేజర్ పంచాయతీలో 8 మంది రెగ్యులర్, 40 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు, ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఒకపూట పనిచేసే 18మంది క్లాప్‌మిత్రలు మాత్రమే పని చేస్తున్నారు. ప్రధాన మార్గాల్లోనే పారిశుధ్య పనులు చేపడుతున్నారు తప్ప వీధుల్లో పనులు కానరావడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. టెక్కలికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు వ్యాపా రాలు చేస్తూ రోడ్లపై చెత్తవేస్తుండడం, ఇళ్ల నుంచి పోగైన చెత్త అంతా కలిపి ట్రాక్టర్లపై తరలించేందుకు సైతం





ఎన్టీఆర్ కాలనీలో రోడ్లపై మురుగునీరు (ఇన్‌సెట్‌లో) ఆదీఆంధ్రా వీధి కాలువలోలో చెత్త

సరిపడా వాహనాలు, సిబ్బంది, డంపింగ్‌యార్డు సౌకర్యాలు అంతంత మాత్రమే. కాలువల్లో పూడికలు తొలగించక పోవడంతో ఏమాత్రం వర్షం పడినా మురుగు, వర్షపు నీరు రోడ్లపై గంటల తరబడి ప్రవహిస్తుం డడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎద ర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై మేజర్‌పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. కాలువల్లో పూడికలు తొలగించేందుకు స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహించాల్సి ఉందన్నారు. ఎన్టీఆర్ కాలనీలో కాలువల్లో పూడికలు తొలగిస్తు న్నామని, ఆదీఆంధ్రా వీధిలో కల్వర్టు పైపు చిన్నది కావడంతో వర్షం పడితే మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, కల్వర్టును సైతం మార్చాల్సి ఉందని తెలిపారు. ఇతర ప్రాంతాలపై దృష్టి సారిస్తామన్నారు.

రోడ్డంతా బురదమయం

వజ్రపుకొత్తూరు, మే 27(ఆంధ్రజ్యోతి): బెండిగేటు సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డు బురదమయం కావ డంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై బురదచేరి వాహనాలు పల్టీ కొడుతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బెండిగేటు వద్ద బురదమయమైన రోడ్డు

చితాభస్మం కావాలా.. సంతకాలు పెట్టండి

- కేశవరావు సోదరులపై ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఒత్తిడి
- విలపిస్తున్న కేశవరావు తల్లి భారతమ్మ

టెక్కలి, మే 27(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజుకు చెందిన చితాభస్మం అయినా ఇవ్వాలని సోదరుడు రాంప్రసాద్ ఛత్తీస్‌గఢ్ పోలీసులను కోరినా నిరాకరించారని, ఎంతసేపు సంతకాలు పెట్టండి.. చూద్దాం అంటూ అక్కడి పోలీసులు ఒత్తిడి చేశారని కేశవరావు మరో సోదరుడు నంబాళ్ల ఢిల్లేశ్వరరావు తెలిపారు. మృతదేహం కోసం మూడురోజులుగా ఫ్రీజర్ వాహనంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ ఆసుపత్రి వద్ద పడిగాపులు కాసినా ప్రయోజనం కనిపించలేదని వాపోయారు. మృతదేహానికి దహన సంస్కారాలు సంప్రదాయబద్ధంగా చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా కుమారుడి మృతదేహాన్ని కడచూపునకు నోచుకోలేదని తల్లి భారతమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కేశవరావు స్వగ్రామం కోటబొమ్మాళి మండలం జీయన్నపేటపై పోలీసులు పూర్తిస్థాయి నిఘా పెట్టారు. హైవే నుంచి జీయన్నపేటకు వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చీ పోయే వారిని ఆరా తీస్తున్నారు. కేశవరావు స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు నివాళులర్పించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

గార, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్‌ఐ చిరంజీవి కథనం మేరకు.. మండలంలోని వత్సవలస దగ్గరలో ఈనెల 22న ఎండ మోహనరావు (47) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు చికిత్సకోసం రిమ్స్ చేరగాలో సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. రిమ్స్ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

కవిటి, మే 27(ఆంధ్రజ్యోతి): కొజ్జిరియా జంక్షన్‌లో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. చీకటి బలరాంపురం నుంచి నడుచుకొని వస్తుండగా ట్రాలర్ లారీ ఢీకొనడంతో 45 నుంచి 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి తలకు దెబ్బతగలడంతో మృతి చెందాడని చెప్పారు. మృతుడు తెలుపురంగు షర్టు, నలుపురంగు జీన్‌ప్యాంట్ వేసుకొని ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కవిటి పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

కొట్లాటలో ఆరుగురిపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల కొట్లాటలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. శ్రీకాకుళంలోని డేఅండ్ నైట్ కూడలి వద్ద ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పలాసకు చెందిన నాగబాల నిల్చొని ఉన్నారు. ఆ సమయంలో శ్రీకాకుళం పెద్ద రెల్లివీధికి చెందిన షణ్ముఖ శ్రీను ద్విచక్ర వాహనంపై వచ్చి నాగబాలను ఢీకొనడంతో వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. అయితే ఇరువర్గాలకు చెందిన మరికొందరు వ్యక్తులు అదే బార్‌లో అప్పటికే మద్యం సేవించి ఉండడంతో ఘర్షణకు దారి తీసి, ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. వీరిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావుకు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం కొట్లాటకు కారణమైన వారిని గుర్తించి, ఆరుగురిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు

పాతపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం మేజర్ పంచాయతీ తెలుకల వీధిలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కాలువ పైకప్పు విరిగి పోయి 20 రోజులవుతున్నా సంబంధిత అధికారులు సరిచేయలేదు. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు కాలువలో పడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సమస్యను పంచాయతీ అధికారులకు తెలిపినా స్పందించలేదన్న విమర్శలొస్తున్నాయి. రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందిగా ఉంటోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై పలకను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



తెలుకుల వీధిలో పాడైన కాలువ పైకప్పు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పల్లిసారథి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు, మే 27(ఆంధ్రజ్యోతి): పల్లిసారధి హైస్కూలలో 2000-21 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం పొందారు. 25 ఏళ్ల తరువాత అందరూ కలుసుకుని ఆప్యాయంగా పలుకరించుకుని అభినందనలు తెలుపుకున్నారు.

మండలానికి చేరిన యూనిఫారాలు

నందిగాం, మే 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు గాను ప్రభుత్వం మంజూరు చేసిన యూనిఫారాలు మండలానికి చేరాయి. ఒకటి నుంచి పది తరగతులకు సంబంధించి బాలురు, బాలికలకు వేర్వేరుగా అందించేందుకు స్థానిక పంపిణీ కేంద్రానికి మంగళవారం రావడంతో ఎంఈవో జి.నర్సింహులు పరిశీలించారు.

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 27(ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను కార్డుదారులకు పక్కాగా పంపిణీ చేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సీఎస్‌డీటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఏ డిపోల నుంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తారో ఆ డిపోలను ముందుగా సీఎస్‌డీటీలు సందర్శించాలన్నారు. కార్డుదారులెంతమంది, సరుకుల నిల్వ, ఈ-పాస్ యంత్రం, తూనికలు, కొలతల సామగ్రి ఉన్నాయో లేదో చూడాలన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలని, నిత్యావసర సరుకులు పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెగ్యులర్, స్వయంశక్తి సంఘాల పరిధిలో ని డిపోలు, అలాగే కోర్టు కేసుల పరిధిలో ఉన్న డిపోలు గమనించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జూన్‌లో కార్డుకి అరకేజీ పంచదార, యూనిట్‌కు ఐదు కేజీల బియ్యం పంపిణీ చేయాలని, డీలర్లు నెలవారీ డీడీలు కట్టేలా చూడాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా అందించాలి

మందస, మే 27(ఆంధ్రజ్యోతి): డిపోల్లో జూన్ 1వ తేదీ నుంచి నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా అందించాలని సివిల్ సప్లై డీటీ సీహెచ్ మురళీధర్ అన్నా రు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. డిపోల్లో సరుకులు ఇస్తున్నట్లు గ్రామాల్లో దండోరా వేయించాలని, ప్రతి డిపో వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దే నిత్యావసర సరుకులను అందించాలని సూచించారు.

జోనల్ స్థాయిలో టెక్కలి డిపోకు రెండో స్థానం

- ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి

టెక్కలి, మే 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆర్టీసీ డిపో అందిస్తున్న సేవల్లో జోనల్ స్థాయిలో రెండో స్థానం నిలిచిందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) కేఎస్ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మంగళవారం టెక్కలి డిపోను సందర్శించారు. ఈ సంద ర్భంగా ఉద్యోగులు, సిబ్బంది పని తీరుపై సమీక్షించారు. డిపో పరిధిలో అన్ని విభాగాలు ఉత్తమ పనితీరు కనబరుస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రయాణికుల మన్ననలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా కండక్టర్ పీవీకే రాజు, ఎస్.రాజులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌లో అత్యధిక బుకింగ్‌లు చేసిన వినియోగదారులు మధు, సుగుణ కుమార్‌లకు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, డిపో మేనేజర్ శ్రీనివా సరావు, సరుకు రవాణా సహాయ మేనేజర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి

ఘనంగా కుంకుమ పూజలు

ఎల్.ఎన్.పేట, మే 27(ఆంధ్రజ్యోతి): పూశాం గ్రామంలో ఉమాచంద్రమౌళేశ్వర స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ, లింగ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన అసిరిపోలమ్మ ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు, మే 27(ఆంధ్రజ్యోతి): పల్లిసారధిలో అసిరిపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు ముగిశాయి. ఐదురోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిమాను ఊరేగింపు చేపట్టారు. పగటివేషాలతో సందడి నెలకొంది.



ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



నదీగర్భంలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడు చేస్తున్న దృశ్యం

కొత్తూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఆకులతంపర వద్ద వంశధార నదీగర్భం నుంచి ఎటువంటి అను మతులు లేకున్నా ఇసుకను యంత్రాలతో లోడ్ చేస్తుండగా మంగళవారం ప్రజలు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో ఇసుక తరలింపుదారులు, ప్రజల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటన సమాచారం పోలీసులకు చేరడంతో అక్రమార్కులు యంత్రాలను అక్కడి నుంచి తరలించారు. కొంతమంది ఇసుక అక్రమ వ్యాపారులు లారీ, టిప్పర్లలో లోడు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు తమ ట్రాక్టర్లలో లోడు చేయాలని పట్టుబట్టడం వల్ల వివాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్రమ ఇసుక రవాణా తగాదా విషయమై సర్పంచ్ నాగళ్ల అప్పన్న తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ఈ సమాచారం పోలీసులకు చేరింది. ఈ విషయమై తహసీల్దార్ కె.బాలకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నదీగర్భం నుంచి యంత్రాలతో లోడ్ చేయించి టిప్పర్లలో తరలింపు విషయం తన దృష్టికి వచ్చిందని, పరిశీలించి నివేదిక ఇవ్వాలని వీఆర్వోను ఆదేశించామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 98 దరఖాస్తులు

హిరమండలం, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి 98 దరఖాస్తులు వచ్చాయని ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలకు 3, భాషా పండిట్లు 5, వ్యాయామ ఉపాధ్యాయులు 2, పీఎస్ హెచ్‌ఎంలు 2, స్కూల్ అసిస్టెంట్‌లకు 39, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 47 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నార న్నారు. మండలంలో మొత్తం 68 ఖాళీలు ఉ న్నాయని ఆయన తెలిపారు.



ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంఈవో

సమస్యలను పరిష్కరించండి

మెళియాపుట్టి, మే 27(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేరసింగిగూడ గిరిజనులు కోరారు. జనసేన నాయకురాలు కొరికాన భవాని మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి రోడ్డు, తాగునీరు, పాఠశాల భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దుక్క బాలరాజు, నక్క క్రాంతికుమార్, ఎస్.వినోద్, కల్యాణ్, విజయకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

పలాసరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. బొడ్డపాడు గ్రామంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అభివృద్ధికి వివిధ రాష్ట్రాల్లో కృషి చేస్తున్న వారికి మంగళవారం అభినందించారు. అండమాన్ రాజధాని శ్రీవిజయపుర (పోర్టుబ్లెయర్) మున్సిపల్ ఛైర్మన్‌గా గెలుపొందిన ఎస్.సాహుల్ హమీదర్, అక్కడ 2, 14, 15 వార్డుల కౌన్సిలర్లుగా గెలుపొందిన రాయుడు సోమేశ్వరరావు, ఎరుపల్లి జోగారావు, బళ్ల పద్మారావు, అండమాన్ టీడీపీ పార్టీ కార్యదర్శి బొడ్డు కాంతారావు, సంయుక్త కార్యదర్శి పోతనపల్లి దుష్యంత్, యూత్ ప్రెసిడెంట్ సత్యనారాయణ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బొడ్డు దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

నరసన్నపేట, మే 27(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఒక్కసారి మేఘావృ తమై భారీ వర్షం కురిసింది. సాయంత్రం సుమారు అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురవగా రాత్రి భారీ స్థాయిలో వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్, బజారువీధి, మఠంవీధి, కొవెలవీధి, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి పోయింది. జమ్ము, తామరాపల్లి గ్రామాల్లో పొలాల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి.



బజారు వీధిలో నిలిచిన వర్షపు నీరు

అమరవీరుల స్మారక సభ నిలుపుదల

(మూడో పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం 36వ స్మారక సభ నిర్వహణకు ప్రజా సంఘాల నేతలు సన్నద్ధం కాగా.. సీఐ సూర్యనారాయణ, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సభ నిర్వహించరాదని తెలిపారు. దీంతో ప్రజాసంఘాల నేతలు, నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించినా ఇదే సమాధానం రావడంతో సభ నిర్వహించలేదు. కాగా.. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఎన్‌కౌంటర్‌లో జిల్లాకు చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమరవీరుల స్మారక సభ నిర్వహిస్తే.. పర్యవసానాలు మారుతాయనే ఉద్దేశంతో సభను పోలీసులు అడ్డుకున్నట్టు తెలుస్తోంది.

న్యూస్ బాక్స్

రేపు శ్రీముఖలింగేశ్వరుని భూముల కౌలు వేలం

జలుమూరు, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి భూముల కౌలు వేలంపాట గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక ఆలయ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆసక్తి గల రైతులు బిట్టు ఒక్కంటికి రూ.లక్ష సాల్వెన్సీ, రూ.30 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

2 నుంచి హోలహాలేశ్వర స్వామి పునః ప్రతిష్ఠోత్సవం

నరసన్నపేట, మే 27(ఆంధ్రజ్యోతి): రెడ్డికపేట-బసివలస గ్రామాల మధ్య ఉన్న శ్రీరాంపాడు హాలహా లేశ్వర స్వామి పునః ప్రతిష్ఠోత్సవం జూన్ 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆలయం ప్రాంగణంలో కరపత్రాలను విడుదల చేసారు. ఎంతో చారిత్రక ప్రశస్తి ఉన్న ఈ ఆలయాన్ని స్థానికులు, దాతలు సహకారంతో సుమారు రూ.80 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టామన్నారు. పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రూ.127 కోట్లతో రుణ ప్రణాళిక

నరసన్నపేట, మే 27(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు మండలంలో రూ.127 కోట్లతో రుణ ప్రణాళికను తయా రు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏ, సీసీ, సీఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల మహిళలు వ్యాపారం, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలివ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీ కొండలరావు, ఏపీఎం అప్పలరామయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన తదితరులు పాల్గొన్నారు.

వ్యవహార శైలి మార్చుకోండి

వజ్రపుకొత్తూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అప్పలరాజు వైఖరితో పలాస నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నాయని, మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని టీడీపీ మండల నేతలు హితవు పలికారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు విలేకరులతో మాట్లాడుతూ.. గరుడభద్రలో గ్రామస్థాయిలో పరిష్కరించు కోవా ల్సిన సమస్యను మాజీ మంత్రి అప్పలరాజు పోలీస్‌స్టేషన్ వరకు తీసుకువెళ్లి రచ్చ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిని టీడీపీ శ్రేణులు ప్రశ్నిస్తే కబ్జాదారులకు మాజీ మంత్రి వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులపై అప్పల రాజు దుందుడుకు వైఖరి ఇప్పటికీ మారలేదన్నారు. సమావేశంలో నాయకులు పోతనపల్లి సాంబమూర్తి, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, కొల్లి రమేష్, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు, ఫ్యాన్ వితరణ

నందిగాం, మే 27(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖా గ్రంథాలయానికి జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్ నేతృత్వంలో కుర్చీలు, ఫ్యాన్ అందించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్‌కు నాలుగు కుర్చీలు, ఒక సీలింగ్ ఫ్యాన్ అందించారు. టీడీపీ, జనసేన నాయకులు పి.రఘుపతి, టి.కోటయ్య, వంశీ, బి.సింహా చలం వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో యోగాంధ్ర

పాతపట్నం/నరసన్నపేట/జలుమూరు/మెళియాపుట్టి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కార్యాలయాలు, గ్రంథాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖాధికారులు, సిబ్బంది యోగాభ్యాసం చేశారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: తహసీల్దార్ కార్యాలయంలో..





పాతపట్నం, జలుమూరుల్లో యోగాభ్యాసం చేస్తున్న అధికారులు, సిబ్బంది